# పల్లవి

"పల్లవీ! నువ్వంటే నాకు చాలా ఇష్టం .."

మోహన్‌రావుగారు చెప్తున్నది తనతోటేనా- ఇది నిజమా? అన్న సంశయంతో ఆశ్చర్యంగా కళ్ళు విప్పార్చి ఆయన వైపు చూసింది పల్లవి. "నిజం పల్లవి!— నేను నిన్ను ప్రేమిస్తున్నాను— " ఈ మాటలతో ఆమె ఆశ్చర్యం ద్విగుణీకృతమైంది.

'అంతస్తుగలవాడు తనలాంటి సాధారణకుటుంబీకురాలిని వరించాడే' అన్న ఆశ్చర్యం కాదు పల్లవిది. అపర మన్మథుడు తనను వలచాడేమిటా అనే సంశయమూ కాదు. అన్యకులమైనా ప్రేమించానంటున్నాడన్న అనుమానం అంతకన్నా కాదు, ఇరవయ్యేవ వసంతం పల్లవిస్తున్న తనకు యాభై సంవత్సరాల మోహన్రావుగారు ప్రేమ పాఠం వల్లించడం అసహజమో, ఆశ్చర్యమో అర్థంకాక, ఆ మాటలే మననం చేసుకుంటూ విభ్రాంతిగా చూస్తున్నది పల్లవి.

ఇన్నాళ్ళుగా ఆయన కళ్ళల్లో కనిపిస్తున్నది వాత్సల్యమని భ్రమ పడ్డందుకు తిట్టుకుని, ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నకామం తన్ను దహించివేస్తున్నట్లు చిగురు టాకులా కంపించి పోయింది పల్లవి.

"పల్లవీ! భయమెందుకు? నీ ప్రేమను నాకు పంచి యిస్తేయిా లోకంలో నువ్వు కావాలన్న ఏ వస్తువైనా నీ కాళ్ళముందు ఉంచుతాను..." మోహన్రావు గారి మాటలకు పల్లవికి మతిపోతున్నది. కొన్ని క్షణాలు కర్తవ్య మూఢురాలిగా ఉండిపోయి, వెంటనే ఏదో నిర్ణయానికి వచ్చినట్లు ఆయన్ని చూసి చిరునవ్వు నవ్వింది.

"నువ్వు నామాట మన్నిస్తావని తెలుసు పల్లవీ! ఈ శుభ సందర్భంలో నీకో మంచి పార్టీ ఇస్తాను. అయిదుగంటలు కావచ్చింది. మరి హోటల్‌కి వెళదామా?..." అణుచుకున్నా అణగని ఆనందాన్ని ఆయన వదనంలో చూడగల్గింది పల్లవి. తన మనసులో చెలరెగే తుఫానుకీ, పెల్లుబుకుతున్న అసహ్యానికీ అడ్డుకట్టవేసి 'అలాగే'నన్నట్లు తలవూపింది. "ఎంతైనా ఆఫీసులో ఆయన తనపై అధికారి. ఈ ఉత్పాతాన్ని సహనంగా ఎదుర్కోవాలి-' అని అనుకున్నదే కానీ తన గుండెల సవ్వడి తనకే వినిపిస్తోంది.

"నీ మౌనంలో ఎన్నిఅర్థాలు, నీ ప్రతి కదలికలో ఎన్నిఅందాలు-పల్లవీ! నువ్వు నా స్వంతమవుతావంటే, ఆ ఊహకే నా మనసు పల్లవిస్తోంది..." మోహన్రావుగారి కవితాప్రవాహాన్ని మౌనంగానే ఆలకిస్తున్నది పల్లవి. ఆమెకు పెదవిదాటి ఒక్కపలుకు బయటపడలేదు.

"అం టైమైంది పద పల్లవీ!'' బయటకి దారితీశాడు ఆఫీసరు మోహన్రావు. వెనకే యాంత్రికంగా బయటకు నడిచింది. కానీ తనకు తెలియకుండానే కాళ్ళు వణుకుతున్నాయి. గుండె దడదడ కొట్టుకుంటోంది.

ఆఫీసులో చాలా జతలకళ్ళు తమని పరికిస్తున్నాయని తెలిసినా చేయగలిగేదేముంది?

హోటల్ సరితముందు కారుఆగింది. పల్లవి మౌనాన్ని అంగీకారంగా తీసుకుని ఆమెచెయ్యి తన చేతిలోకి తీసుకుని మోహన్రావుగారు పులకాంకితుడవుతుంటే పల్లవికళ్ళు జలదరించగా, సున్నితంగా చెయ్యివిడిపించుకుంది.

వెర్రి ఆనందంతో టిఫిన్లు, స్వీట్సు వరసగా తెప్పించారు మోహన్ రావుగారు. అన్నీ చూస్తూ ఊరుకుంది పల్లవి. కాఫీ మాత్రం తీసుకుంది.

ఆమె మౌనమేమిటో అర్థంకాక ఇప్పుడు తికమక పడుతున్నాడు మోహన్‌రావుగారు. "పల్లవీ! ఎక్కడికి వెళ్దామో ఇప్పుడైనా చెప్తావా- దానికే నోటి ముత్యాలు రాలిపోతాయా?" నిష్టురంగా అన్న ఆయన మాటలకు కిలకిల నవ్వింది, పల్లవి,

"నేను చెప్పిన చోటికి తప్పకుండా తీసుకువెళ్తారా మరి?"

ఎట్టకేలకు పల్లవి నోటి నుండి వచ్చిన ఆ మాటకే ఉబ్బితబ్బిబ్బై, "చెప్పు పల్లవీ! కాశ్మీర్, కన్యాకుమారికైనాసరే- క్షణాల మీద ఏర్పాటు చేస్తాను..." అన్నాడు.

"ఊహుఁ అంత పెద్దకోరికలులేవు..."

"మరెక్కడికి వెళదామో తొందరగా చెప్పు పల్లవీ! ..." కార్లో కూర్చుంటూ అడిగాడు మోహన్రావుగారు.

"మీ ఇంటికి వెళదాం...."

అదిరి పడ్డాడు మోహన్రావుగారు. కంగారుగా అన్నాడు, "మా ఇంటికెందుకు పల్లవీ?"

"నన్ను ఎక్కడికంటే అక్కడికి తీసుకెళతానన్నారుగదా! మీ ఇంటికి నన్ను తీసుకువెళ్ళడం ఇష్టంలేకపోతే చెప్పండి. ఇప్పుడే వెళ్ళిపోతాను..." అలక సాగించింది పల్లవి. "నీ ఇష్టం పల్లవీ - మాఇంటికే వెళదాం. కానీ ఎందుకో చెప్పు. వెళ్ళి యేం చేస్తాం..."

"అక్కడ మిమ్మల్ని నేను అవమానించనని మాటిస్తాను. ఆపైన మీఇష్టం''- పల్లవి. మౌనంగానే కారు నడిపాడు మోహన్రావుగారు.

మోహన్రావుగారి భార్య వనజ ఎదురు వచ్చింది. "వనజా; మొన్న కొత్తగా చేరిందని చెప్పానే నా పర్సనల్ సెక్రటరీ- ఈమే, పేరు పల్లవి. నిన్ను చూడాలనుందంటే తీసుకువచ్చాను.'' అని భార్యకు పరిచయం చేశాడు. ఆమె ''లోపలికి రామ్మా'' అంటూ సాదరంగా ఆహ్వానించింది.

పల్లవి మనస్తత్వమేమిటో అంతుపట్టడంలేదు మోహన్రావుకు. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి వనజ కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళింది, "పల్లవీ! అసలు నీ ఉద్దేశమేమిటో అర్థంకావడంలేదు-" అసహనంగా అంటున్న మోహన్రావుగార్ని చూసి మళ్ళీ నవ్వింది పల్లవి.

"వనజతో యేమీ చెప్పకు పల్లవి" నెమ్మది స్వరంతో ముందుకు వంగి అన్నాడు మోహన్రావుగారు. సరేనన్నట్లు తలాడించింది.

"ఇదిగోమ్మా! కొంచెం ఉప్మా తీసుకో" అంటూ వనజ ఒక ప్లేటు పల్లవికీ, రెండోది మోహన్రావుగారికి అందించింది. ఇప్పుడెందుకంటూ మొహమాటపడ్డా వనజ బలవంతంవల్ల తీసుకోక తప్పలేదు.

"ఇక్కడ ఎవరెవరుంటూన్నారమ్మా- మీ నాన్నగారేం చేస్తూం టారు?" సంభాషణకు నాందిగా ప్రశ్నించింది వనజ.

"నేను మేనమామ దగ్గర ఉంటున్నానండీ! నాకు ఊహ తెలిసే నాటికే మా అమ్మా, నాన్నా చనిపోయారు. ఫొటోలో చూడడం తప్ప మా నాన్న మొహం నాకు గుర్తులేదు. ఈఆఫీసులో చేరిన రోజున వీరిని చూడ గానే మా నాన్న నాకళ్ళ ముందు నిలిచినట్లయింది. అంతగా పోలికలుం డడం ఆశ్చర్యం కలిగించింది. మోహన్రావుగారు కూడా నన్ను క్రింది ఉద్యోగినిలా కాక చాలా ఆప్యాయంగా చూస్తారు. మీరూ యీరోజు ఎంతో ప్రేమగా పలకరించి ఆదరించారు. మీ ఇద్దర్నీ చూస్తూంటే నాకు నాతల్లి దండ్రులను చూస్తూన్నంత ఆనందంగా ఉన్నది..." గద్గద స్వరంతో అంటున్న పల్లవి కళ్ళల్లోనుంచి అనియంత్రితంగానే కన్నీరు జారి పడింది. వనజ మనసు ఆర్ద్రమైపోయింది. పల్లవి చేతిని అనునయంగా తన చేతిలోకి తీసుకున్నది. పల్లవి మాటలు కలలాగా అనిపిస్తుంటే తన మన శ్చాంచల్యాన్ని తిట్టుకుంటూ పల్లవి మనస్తత్వాన్ని అంచనాచేస్తూ స్థాణువులా ఉండిపోయారు ఆఫీసరు మోహన్రావుగారు.

(వనితాజ్యోతి మాసపత్రిక అక్టోబరు- '79)